విజ్యూరిచ్ లో ప్రవాస ఆంధ్రుల తో సమావేశం ఎంతో ఉల్లాసంగా జరిగింది. అక్కడి తెలుగు ప్రజలు చూపించిన ఆదరాభిమానాలు మరువలేనివి:

ఏపీ సీఎం బాబు




తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

The largest telugu daily news paper




## ఉగ్రవాదుల కాల్పుల్లో ఆర్మీ జవాన్ వీర మరణం


హైదారాబాద్ 21-01-2025 మంగళవారం సంపుటి 1. సంచిక 169

Www.dailyreport Telugu.com

Hyderabad ,Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Suryapet, Sangareddy, Medak ,Siddipet ,Eluru, Kurnool , Warangal


# కింగ్ ఫిషర్ బీర్ల సరఫరాపై యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ కీలక ప్రకటన





డైలీ రిపోర్ట్, తెలంగాణ బ్యూరో:
తెలంగాణలో కింగ్ ఫిషర్ బీర్ల సరఫరాపై యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపింది. ఈ అంశంపై ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. ధరల పెంపు, బకాయిల చెల్లింపులపై తెలంగాణ బేవరేజెస్ కార్పోరేషన్ లిమిటెడ్‌తో చర్చలు జరిగిన తర్వాత సంస్థ నుంచి ఈ ప్రకటన వచ్చింది. సమస్యలను పరిష్కరిస్తామని తెలంగాణ బీవరేజెస్ కార్పోరేషన్ లిమిటెడ్ హామీ ఇచ్చింది.ప్రభుత్వం నుంచి హామీ రావడంతో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు యునైటెడ్ బ్రూవరీస్ తెలిపింది. వినియోగదారులు, కార్మికుల వాటాదారుల ప్రయోజనాల దృష్ట్యా మధ్యంతర నిర్ణయం తీసుకున్నామన్నారు. సెబీ రెగ్యులేషన్స్‌కి అనుగుణంగా తెలంగాణ బీవరేజెస్ కార్పోరేషన్ లిమిటెడ్‌కి బీర్ల సరఫరాను తక్షణమే అమల్లోకి తీసుకు వస్తున్నట్లు సంస్థ ప్రకటించింది.

**తెలంగాణలో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు యూబీ ప్రకటన ధరల పెంపు, బకాయిలపై ప్రభుత్వంతో చర్చలు తెలంగాణ బేవరేజెస్ కార్పోరేషన్ నుంచి సానుకూల ప్రకటన వచ్చిందన్న సంస్థ**

# అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు

వాషింగ్టన్ డీసీ, జనవరి 20: డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక, టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథుల సమక్షంలో సోమవారం క్యాపిటల్ బిల్డింగ్‌లో జరిగిన వేడుకలో రిపబ్లికన్ నేత 47వ దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. నవంబరులో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన 78 ఏళ్ల ట్రంప్ చేత అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయించారు. 1861లో అబ్రహాం లింకన్ ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్‌ను చేతిలో పట్టుకొని ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ కంటే ముందు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం చేశారు. వాషింగ్టన్‌లో తీవ్రమైన చలిగాలులు వీస్తుండటంతో కాపిటల్ బిల్డింగ్ లాన్‌లో వేడుకగా జరగాల్సిన కార్యక్రమాన్ని లోపల హాల్లోకి మార్చారు. బయట సాంస్కృతిక కార్యక్రమాలు, మిలిటరీ పరేడ్ యధావిధిగా సాగాయి.



- గండరగండడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అమెరికా అధ్యక్షుడిగా ఆసీనులయ్యారు. పలు ఎగుడుదిగుళ్లు చూసిన రాజకీయ జీవితంలో పలుమార్లు పదవీచ్యుతి ప్రయత్నాలను, పలు నేరారోపణలను,హత్యాయత్నాలను అధిగమించి మరోసారి శ్వేతసౌధం అధిపతిగా బాధ్యతలు స్వీకరించారు.



# కవిత వ్యాఖ్యలపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు కౌంటర్

డైలీ రిపోర్ట్, సంగారెడ్డి బ్యూరో :

పసుపు బోర్డు తమ పోరాటం వల్లే వచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కవిత వ్యాఖ్యలపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పందించారు. కవిత జైల్లో ఉన్నప్పుడు ఆమె ఆరోగ్యం బాగోలేదని వార్తలు వచ్చాయని.. చెల్లె కవిత ఇప్పటికి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంది… మంచి డాక్టర్‌కు చూపిస్తే ఆమె ఆరోగ్యం బాగుపడుతుందని ఎంపీ రఘునందన్ రావు సలహా ఇచ్చారు. మొదటగా ఆమె ఆస్పత్రిలో చూయించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడితే బాగుంటుందని అన్నారు. సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో (సోమవారం) మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ…పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మాజీ మంత్రి కేటీఆర్‌కు రైతులు గుర్తుకు రాలేదా అని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ చుట్టూ ఉన్న గ్రామాల్లో రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీకి అధికారం పోయాక రైతులపై కేటీఆర్‌కు ప్రేమ పెరిగిందా అని ప్రశ్నించారు. అధికారం పోయాక కేటీఆర్ రైతు ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అంబేద్కర్‌కు అవమానం జరిగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఐదున్నర దశాబ్దాలు అధికారంలో ఉండి ఏనాడూ అంబేద్కర్‌ను గౌరవించలేదని అన్నారు. కేవలం అంబేద్కర్ జయంతి, వర్ధంతులు తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదని ఎంపీ రఘునందన్ రావు ఆక్షేపించారు.

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు.
- అధికారం పోయాక కేటీఆర్ రైతు ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు.
- కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అంబేద్కర్‌కు అవమానం జరిగిందని ఎంపీ రఘునందన్ రావు గుర్తుచేశారు.



1950 లో నామినేటెడ్ ప్రధానిగా ఉన్నప్పుడే జవహర్ లాల్ నెహ్రూ రాజ్యాంగానికి తూట్లు పొడిచారని ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. రెండోసారి ప్రధానిగా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ తీసుకువచ్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని ఆరోపించారు. గాంధీ, నెహ్రూ కుటుంబాల్లోని ఐదు తరాలు రాజ్యాంగాన్ని అవమానించారు, తుంగలో తొక్కారని ఆక్షేపించారు. ఆనాడు ప్రధాని మన్మోహన్ సింగ్‌ని కాదని యూపీఏ చైర్ పర్సన్‌గా సోనియా గాంధీ నిర్ణయాలు తీసుకుని రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని చెప్పారు. ఇప్పుడు రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని రక్షించండి అంటూ రోడ్లపై తిరుగుతున్నారని అన్నారు. అధికారంలో లేనప్పుడు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి పేదలు గుర్తుకు వస్తారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు.

# నేటి నుంచి గ్రామ సభలు



హైదరాబాద్, జనవరి 20 (డైలీ రిపోర్ట్): నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాలకు సంబంధించి అర్హులను గుర్తించేందుకు గ్రామసభల నిర్వహణకు వేళైంది. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారులను గుర్తించేందుకు మంగళవారం నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. అనంతరం.. ఈ పథకాలను 26న ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది. ప్రజాపాలన దరఖాస్తులు, గతంలో మీ–సేవ కేంద్రాల్లో వచ్చిన దరఖాస్తులు, కులగణన, ప్రభుత్వం వద్ద ఉన్న పేద కుటుంబాల సమాచారం ఆధారంగా లబ్ధిదారుల తాత్కాలిక జాబితా సిద్ధం చేశారు. దాని ఆధారంగా ఆయా కుటుంబాల ద్వారా సమగ్ర సమాచారం రాబట్టారు.

- అక్కడే కొద్దిసేపు భేటీ.. పలు అంశాలపై ఇరువురి చర్చ
- ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సు ప్రారంభం
- తొలిరోజు ఘనంగా గ్రాండ్ ఇండియా పెవిలియన్

# జ్యూరిక్ ఎయిర్‌పోర్టులో కలిసిన తెలుగు రాష్ట్రాల సీఎంలు



హైదరాబాద్, జనవరి 20 (డైలీ రిపోర్ట్): స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం జ్యూరిక్ విమానాశ్రయంలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడును కలుసుకున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులతో కలిసి గత నాలుగు రోజులుగా సింగపూర్‌లో పర్యటించిన సీఎం రేవంత్.. అక్కడి నుంచి దావోస్ సమావేశాల కోసం బయలుదేరి సోమవారం జ్యూరిక్ విమానాశ్రయానికి చేరుకున్నారు.